క్లుప్తంగా

ఎస్సీకాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతి



ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామ ఎస్సీకాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌ను నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఎస్సీకాలనీ మహిళలు కలసి వినతి పత్రం అందజేశారు. కాలనీలో తీవ్రంగా నీటి సమస్య ఉందని కొన్ని వార్డుల్లో కరెంటు స్తంభాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు. కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చేవూరి రామమోహన్‌రెడ్డి, సర్పంచ్ చుక్కా రూతు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

కేఎల్‌యూ డీన్ డాక్టర్ సీహెచ్ హనుమంతరావు



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయం సీఈఏ (సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ) ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలం పెదకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్. హనుమంతరావు మాట్లాడారు. విద్యార్థులను వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావులు అభినందించారు. కార్యక్రమంలో సాక్ డైరెక్టర్ సాయి విజయ్, అసోసియేట్ డీన్ రూతు రమ్య, సీఈఏ ప్రొ. ఇన్‌ఛార్జి డాక్టర్ సుబ్రహ్మణ్యం, కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

సమస్యల పరిష్కారం కోసం వినతి



మేడికొండూరు: సమస్యలు పరిష్కరించాలని యానిమేటర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలి, మూడు సంవత్సరాల కాలపరిమితి పూర్తిగా రద్దుచేయాలి, అర్హత ఉన్న వీఓఏలకు సీసీలుగా ప్రమోషన్ కల్పించాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాస శర్మ, ఎంపీడీఓ ప్రభాకరరావు, వెలుగు ఏపీఎం విజయభారతిలను మంగళవారం కలసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.కనక దుర్గ, వై సుజాత, పీరాబి, యూ భాగ్యలక్ష్మి, శిరీష, ప్రసన్న, ఎస్ శ్రీదేవి, వై శ్రీదేవి, మౌనిక, దొప్పలపూడి జ్యోతి, హస్సీన, ఎస్ శిరీష, మౌనిక, పర్విన్, మహ్మద పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మృతి

అంత్యక్రియలకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఎల్‌బీ నగర్‌లో నివాసముండే వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు అక్కల వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయన మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి ఆర్థిక పరిస్థితి సరిగా లేదని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే అంత్యక్రియల నిమిత్తం 10 వేల రూపాయలు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఫిరోజ్, పట్టణ వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు ఆకురాతి రాజేష్, ఎస్సీ విభాగం నాయకులు బెజ్జం రాజాజీ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం



వృద్ధురాలిని వివరాలు అడుగుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు



జెడ్పీపాఠశాలలో మధ్యాహ్నభోజనం రుచిచూస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి శైలజ

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

ఫిరంగిపురం: ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి అన్నారు. మండలంలోని మునగపాడు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ప్రజలతో మాట్లాడారు. వైద్యసేవలు సరిగా అందుతున్నాయా, నెలకు సరిపడా మందులు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. వైద్యపరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన రోగుల వద్దకు వెళ్లి ఏ పరీక్షలు చేశారనే దానిపై వైద్యురాలు యానీగ్రేస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి, ప్రతి ఒక్కరి పేరు నమోదు చేస్తున్న వివరాలు ఆన్‌లైన్‌లో పరిశీలించారు. గర్భిణులు ఎందరు వస్తున్నదీ వారికి అందుతున్న సేవలు గురించి, ఆన్‌లైన్‌లో వారి వివరాలు నమోదు చేస్తున్న విషయాలను డేటా ఎంట్రీ ఆపరేటర్ విజయ్ కుమార్‌ను అడగడంతో ఆ వివరాలు ఆన్‌లైన్ చేసిన విధానం తెలియజేశాడు. రోగుల వివరాలు నమోదుతోపాటు వారి ఫోన్ నెంబర్‌ను నమోదు చేసినట్లయితే క్యాంప్‌నకు రానిచో వారికి ఫోన్‌చేసి పిలిచేందుకు వీలవుతుందని కలెక్టర్ వేణుగోపాలరెడ్డి సూచించారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన అవ్వ–తాత కంటివెలుగు ప్రోగ్రాంలో భాగంగా ఎందరిని పరీక్షించారనే దానిపై వివరాలు అడిగి, ఎంతమందికి ఆపరేషన్లు చేశారో, ఎందరికి కళ్లజోళ్లు అందించారో తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ, సూపర్‌వైజర్ కొండపల్లి సుదర్శన్‌రాజు, ఎంఎల్‌హెచ్‌పీ పద్మజ, ఏఎన్‌ఎం పాపులమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాల తనిఖీ

మునగపాడు గ్రామంలో జెడ్పీ పాఠశాలను జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి తనిఖీచేశారు. బడి ఈడు పిల్లలు బడిలో కొనసాగుతున్నారా, ఎందరు డ్రాప్‌అవుట్‌లో ఉన్నారో వాటి వివరాలను ఎంఈవోలు మహబూబ్ సుభానీ, రవికాంత్‌లను ప్రశ్నించారు. బడి బయట పిల్లలు తప్పనిసరిగా బడిలో చదువుకునేలా చూడాలని చెప్పారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు ప్రభుత్వం అందజేసిన యూనీఫాం, బూట్లు తప్పనిసరిగా ధరించి వచ్చేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తిన్నారు. మరింత మెరుగుగా ఉండేలా చూడాలని చెప్పారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖాధికారి శైలజ, ఏపీసీ విజయలక్ష్మి, ఎంపీడీవో డి.అనూరాధ, ఈవోపీఆర్డీ నిర్మలలక్ష్మి, కార్యదర్శి విష్ణువర్ధన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ రెహమాన్, వీఆర్వోలు బ్రహ్మయ్య, కోటేశ్వరరావు, పాఠశాలహెచ్‌ఎం అంజనేదేవి పాల్గొన్నారు.

పిండ మార్పిడి పద్ధతితో మేలు జాతి పశువుల ఉత్పత్తి



పుట్టిన దూడను పరిశీలిస్తున్న లాం శాస్త్రవేత్తలు, పశుగణాభివృద్ధి సంస్థ బృందం

తాడికొండ: పిండ మార్పిడి పద్ధతిలో సంతానోత్పత్తి చేపట్టడం ద్వారా మేలు జాతి పశువులను ఉత్పత్తి చేయవచ్చని లాం ఫాం శస్త్రవేత్తల బృందం తెలిపింది. తాడికొండ మండలం రావెల గ్రామంలో పిండ మార్పిడి పద్ధతి ద్వారా గేదెల్లో సంతానోత్పత్తి చేసేందుకు అద్దె గర్భం ద్వారా ప్రవేశపెట్టి విజయవంతంగా ఉత్పత్తి చేసిన దూడను మంగళవారం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఈ పద్ధతిలో అద్దె గర్భం ద్వారా ప్రవేశపెట్టిన వీర్య ద్వారా పుట్టిన దూడ ఆరోగ్యంగా ఉందని వారు తెలిపారు. రైతు షేక్ సైదా, మువ్వా శేషగిరిరావుకు చెందిన గేదెల్లో లింగనిర్ధార వీర్యం ద్వారా అభివృద్ధి చేసిన దూడను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈనెల 10 – 13వ తేదీన బుర్రా జాతి దూడలు జన్మించాయని తెలిపారు. ఇప్పటి వరకు లింగమార్పిడి పద్ధతి ద్వారా సంతానోత్పత్తి కేవలం ఆవుల్లో మాత్రమే జరిగేదని, తొలిసారి ఏపీలో ప్రవేశపెట్టి విజయవంతం చేసినట్లు ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీమన్నారాయణరావు, ఈఓ డాక్టర్ బాలశంకరరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహాయ సంచాకులు డాక్టర్ పి.శ్రీనివాసరావు, ఏపీఎల్‌డీఏ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు, స్థానిక వైద్యులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు. పిండ మార్పిడి పద్ధతిలో సంతానోత్పత్తికి సహకరించిన స్థానిక వైద్యులు డాక్టర్ రవితేజ, డాక్టర్ సౌజన్యలను అధికారులు అభినందించారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన

తాడేపల్లిరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరుతూ మంగళవారం వడ్డేశ్వరంలోని రాష్ట్ర సీడీఎంఏ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రంగనాయకులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కోటిదాస్, ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గండికోట దుర్గారావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు అన్నవరపు ప్రభాకర్, హనుమంతరావు, చిన్ని సత్యనారాయణ, రామచంద్రయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరి బందెల రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.మల్లేశ్వరరావు, కోశాధికారి తాడికొండ వాసు, రాష్ట్ర సమితి సభ్యులు వర్రీ, సురేష్‌కుమార్, తారక రామారావు తదితరులు పాల్గొన్నారు.

2050 నాటికి బ్రెయిన్ సమస్యలు పెరుగుతాయి

కేఎల్ యూనివర్సిటీ ప్రొ.చాన్స్‌లర్ ప్రొఫెసర్ జగన్నాధరావు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ జగన్నాథరావు, పక్కన డాక్టర్ హనుమశ్రీనివాసరెడ్డి, డాక్టర్ తారక్‌నాథ్

గుంటూరు మెడికల్: ప్రపంచ వ్యాప్తంగా 2050 నాటికి బ్రెయిన్ సమస్యలు విపరీతంగా పెరిగిపోతాయని, వైద్య రంగానికి అదొక పెద్ద సవాల్‌గా మారుతోందని కేఎల్ యూనివర్సిటీ ప్రొ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జగన్నాథరావు అన్నారు. గుంటూరులోని బ్రింద న్యూరో ఇనిస్టిట్యూట్‌లో మంగళవారం ఇంజినీరింగ్ విద్యార్థులకు న్యూరో నావిగేషన్, ఇంజినీరింగ్ టూ మెడిసిన్ అనే అంశంపై, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించి బ్రెయిన్ సమస్యలు తొందరగా ఎలా కనుగొంటారనే విషయాలపై వర్క్‌షాప్ జరిగింది. ఈసందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ జగన్నాధరావు మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటిసారిగా ఇంజినీరింగ్ విద్యార్థులకు హాస్పటల్‌లో ప్రాక్టికల్స్ నిర్వహించడం నేడు జరిగిందన్నారు. వర్క్‌షాపులో భాగంగా బ్రెయిన్ సర్జరీలు ఏవిధంగా చేస్తారనే విషయాలను ప్రాక్టికల్‌గా ఇంజినీరింగ్ విద్యార్థులకు వివరించడం జరిగిందన్నారు. బ్రింద న్యూరో సెంటర్ సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, కేఎల్ యూనివర్సిటీ, బ్రింద న్యూరో సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. న్యూరో నావిగేషన్ అంటే జీపీఎస్ సిస్టమేనని వెల్లడించారు. న్యూరో నావిగేషన్ ద్వారా వైద్యులకు ఆపరేషన్లు చేయడం చాలా సులువుగా మారిందన్నారు. సీనియర్ న్యూరాలజిస్టు తారక్‌నాథ్ అసోసియేట్ ప్రొఫెసర్ వసుధ, రేడియాలజిస్టు డాక్టర్ జమ్ముల అనిత, తదితరులు పాల్గొన్నారు.

నేడు కళావిపంచి వార్షికోత్సవం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై బుధవారం కళావిపంచి 17వ వార్షికోత్సవం, టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా డాక్టర్ రవి వడ్లమాని ఆదర్శ దంపతులకు ఆంధ్ర కేసరి విశిష్ట సేవా పురస్కారం అందించి ఘనంగా సత్కరించనున్నట్లు కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు ప్రకటనలో తెలిపారు. భాగవతుల సౌమ్య కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.

లక్ష్మారెడ్డికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు నివాళి



గుంటూరు ఎడ్యుకేషన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.లక్ష్మారెడ్డి భౌతిక కాయానికి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు నివాళులర్పించారు. మంగళవారం అమరావతిరోడ్డు నగరాలులోని లక్ష్మారెడ్డి నివాసంలో ఉంచిన ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు వారి కుటుంబానికి సంతాపాన్ని తెలియజేశారు. లక్ష్మారెడ్డికి నివాళులర్పించిన వారిలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, నాయకులు ఎం.హనుమంతరావు, ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు జి.హృదయరాజు, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. నరహరి, ఎన్వీ రమణయ్య, ఉపాధ్యాయ నాయకుడు జి.కైలాష్‌నాథ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రైల్వే గేట్ల సమస్యలు పరిష్కరించాలి



లక్ష్మీపురం: గుంటూరు తూర్పు నియోజకవర్గంలో భారీ ట్రాఫిక్ ఇక్కట్లు నెలకొంటున్న రైల్వే గేట్ల సమస్యలపై వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం మహిళా నాయకురాలు నూరి ఫాతిమా మంగళవారం నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు శ్రీ కృష్ణ దేవరాయలును, గుంటూరు రైల్వే డీఆర్‌ఎం రామకృష్ణలను కలసి చర్చించారు. నెహ్రూనగర్ ఆర్‌యూబీ, సంజీవయ్య నగర్, రెడ్డిపాలెంకు సంబంధించి ఆర్‌ఓబీల అభివృద్ధి పనులపై వినతి పత్రం అందజేశారు. ఈ విషయం పై స్పందించిన రైల్వే డీఆర్‌ఎం సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. నియోజకవర్గం కార్పొరేటర్లు రామనబోయిన అజయ్, మార్కెట్ శ్రీను, పాపతోటి అంబేడ్కర్, యాట్ల రవి, డి.వంశీ, అగ్గిపెట్టి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో ఇస్త్రి బండి అందజేత



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని కాజ గ్రామానికి చెందిన పాలకేటి శివయ్యకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహాయంతో ఇస్త్రి బండిని వైఎస్సార్ సీపీ నాయకులు కమ్మెల సుబ్బారావు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆళ్ల బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, బియ్యం పంపిణీ



తాడికొండ: పేదలకు సాయం అందించేందుకు దాతలు ముందుకు రావాలని డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు అన్నారు. తాడికొండ మండలం లాం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు బెజ్జం సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుస్తులు, బియ్యం పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజు మాట్లాడుతూ నిత్యం ప్రజలతో మమేకమై వారికి సేవలు అందిస్తున్న చిరుద్యోగులకు సాయం అందించేందుకు బెజ్జం సాయిప్రసాద్ తన వంతు బాధ్యతగా ముందుకు రావడం హర్షణీయమన్నారు. మరికొంత మంది దాతలు స్పందించి గ్రామాల్లో అరకొర జీతాలతో కాలం గడుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు, ఆశ కార్యకర్తలు, పేదలకు సాయం అందించేందుకు ముందుకు రావాలన్నారు. 18 మంది పారిశుద్ధ్య కార్మికులు, నలుగురు ఆశ వర్కర్లు, ముగ్గురు సచివాలయ కన్వీనర్లకు ఉచితంగా బియ్యం, దుస్తులు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ సలీం, దాసరి రంగారావు, షేక్ హుస్సేన్, గోల్డ్ బాబు పాల్గొన్నారు.

నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం

నెహ్రూనగర్: రాష్ట్రంలో ఉన్న లక్షలాదిమంది గిరిజనుల సంక్షేమం, వారి సామాజిక, రాజకీయ అభివృద్ధి కోసం దశాబ్దాలుగా కృషి చేస్తున్న నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభ రవిబాబు, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్‌లపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా గౌరవ అధ్యక్షుడు మొగిలి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం అమ రాతి రోడ్డులోని సంఘ కార్యాలయంలో జరిగిన స మావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల ద్వారా గిరిజన నాయకులపై బురద జల్లి తమ పబ్బం గ డుపుకోవాలని చూస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా రాంబాబు, రాష్ట్ర నా యకులు పాలపర్తి రామారావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేడా రామకృష్ణా, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి సారించాం

మంగళగిరి నియోజకవర్గ ఈఆర్‌ఓ కె.లలిత



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న నియోజకవర్గ ఈఆర్‌ఓ కె.లలిత

తాడేపల్లిరూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తొలగించే ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించామని, రాబోయే ఎన్నికల్లో పారదర్శకమైన ఓటర్ల జాబితాను అందించేవిధంగా పనిచేస్తున్నట్లు మంగళగిరి నియోజకవర్గ ఈఆర్‌ఓ కె.లలిత అన్నారు. మంగళవారం మంగళగిరి అర్బన్ పరిధిలోని 148, 167 పోలింగ్‌స్టేషన్ పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓట్ల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. లలిత మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తొలగింపులపై ప్రత్యేక దృష్టి సారించామని, రానున్న ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా జాబితాను సిద్ధం చేయాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఇంటింటి సర్వే చేపట్టిందని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్తగా అర్హులైన వారికి ఓటు హక్కు నమోదు చేయడం జరుగుతుందని, ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే ఆ వ్యక్తి ప్రతిపాదనకు అవసరమైన చోట ఓటు హక్కు ఉంచి, అవసరం లేని చోట ఓటు హక్కు తొలగిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో ఓటరు జాబితాలో పేర్లు లేని 18 సంవత్సరాల వయసు నిండిన వారిని ఓటరుగా నమోదు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఓట్లను నమోదు చేయడంలో గానీ, తొలగింపులో కానీ అవకతవకలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో మంగళగిరి అర్బన్ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కె.హేమమాలిని, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను స్వస్థలాలకు బదిలీ చేయాలి

పాత గుంటూరు: ఎస్ జీఎస్టీలో సాధారణ బదిలీలలో గుంటూరు జిల్లా, జోన్ 3కు చెందిన ఉద్యోగులు దూరప్రాంతాలైన విశాఖపట్నం, తిరుపతి, కడప బదిలీ అయ్యారని తిరిగి వారిని ఆన్‌డ్యూటీ (ఓడీ) సౌకర్యంపై తమ సొంత ప్రాంతాలకు రప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ది కమర్షియల్ టాక్స్ ఎన్‌జీఓ అసోసియేషన్ గుంటూరు–2 డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ జానీబాషా, వెంకట కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. దూర ప్రాంతాలకు వెళ్లిన ఉద్యోగులందరూ కారుణ్య ప్రాతిపదికన నియామకమయ్యారని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిదండ్రులు ఆ ఉద్యోగులపై ఆధార పడి వున్నారని, తక్కువ సర్వీస్ కలిగినవారు, తక్కువ జీతాలతో జీవనం సాగిస్తున్నారని ఆ ఉద్యోగులను స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు.

ముమ్మరంగా రహదారుల నిర్మాణం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో రహదారి నిర్మాణాలను ఎమ్మెల్యే ఆర్కే తన సొంత నిధులతో చేపట్టారు. మంగళవారం నుంచి ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దుగ్గిరాల మండలం మంచికలపూడి, పెనుమూలి, కంఠంరాజు కొండూరు గ్రామాల్లో సుమారు 10 రోడ్ల వరకు నిర్మాణాలు చేపట్టారు. ఈమని గ్రామంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టారు. పెనుమూలి ముస్లిం ఈద్గా, ఎస్సీ కమ్యూనిటీ హాల్ గ్రావెల్ ఫిల్లింగ్ పనులు పూర్తి చేశారు. మంచికలపూడిలో బీసీ, ఎస్సీ కాలనీలలో గ్రావెల్ రోడ్ నిర్మాణం, కంఠంరాజు కొండూరులో గ్రావెల్ రోడ్ నిర్మాణాలతోపాటు హిందూ, ముస్లిం, క్రైస్తవ శ్మశానవాటికల్లో గ్రావెల్ ఫిల్లింగ్, అంతర్గత రోడ్లు నిర్మాణం చేపట్టారు. దాదాపుగా 10 రోడ్ల నిర్మాణాలతో పాటు శ్మశానవాటికలను గ్రావెల్ ఫిల్లింగ్ చేయడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు.